

భగత్‌సింగ్ రాజ్‌గురు సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో వారి చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, శాసనమండలి సభ్యుడు నెల్లికంటి సత్యం, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, సహాయ కార్యదర్శి రెహమాన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్రి శ్రీమాన్, సిపిఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి గోవింద్, బోయ శ్రీరాములు, బోడ అంజయ్య నివాళులర్పించారు.




## భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి

ఎన్‌కెఎం కన్వీనర్‌ల పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు అమరవీరుల స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేక దినంగా పోరాడుదామని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు పశ్యపద్మ, టి.సాగర్, బి.రాము, మామిడాల బిక్షపతి, జక్కుల వెంకటయ్యలు పిలుపునిచ్చారు. హిమాయత్ నగర్‌లో జరిగిన భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపాలని, అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని, 4 కార్మిక చట్టాలను, ఇతర కార్పొరేట్ అనుకూల చట్టాలు, విధానాలను తిరస్కరించాలని డిమాండ చేశారు. ఇరాన్‌పై యుద్ధం అనైతికమైనది, చట్టవిరుద్ధమైనది. డోనాల్డ్ ట్రంప్, బెంజమిన్ నెతన్యాహులను యుద్ధ నేరస్థులుగా ప్రకటించి, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించినందుకు, సార్వభౌమ దేశమైన ఇరాన్‌పై దాడి చేసినందుకు వారిపై విచారణ జరిగేలా చూడాలని కోరారు. అమెరికా సామ్రాజ్యవాదానికి మోదీ ప్రభుత్వం లొంగిపోవడానికి, ఇరాన్‌పై యుద్ధానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని రైతులు, మేధావులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యస్‌కెయం నాయకులు మూడ్ శోభన్, జ్వాలా వెంకటేశ్వర్లు, హాజీ మలంగ్, కాశీం తదితరులు పాల్గొన్నారు.



## ఒయులో భగత్‌సింగ్ వర్ధంతి

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** భగత్‌సింగ్ 95వ వర్ధంతిని ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. సంఘం ఒయు అధ్యక్షుడు ఉప్పల ఉదయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి పాల్గొన్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ భగత్ సింగ్ 23 సంవత్సరాలకే స్వాతంత్ర పోరాటంలో పాల్గొని ఉరిని ముద్దాడిన చరిత్ర అతనిదన్నారు. దేశ స్వాతంత్రంలో పాల్గొని శాస్త్రీయ భావాలు పరిచయం చేస్తూ, సోషలిస్టు స్వప్నాన్ని కాంక్షించిన ఉద్యమకారుడన్నారు. భగత్‌సింగ్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ ఈ దేశ నిరుద్యోగ యువతకు ఇవ్వాలని, అలాగే భారతరత్న ఇవ్వాలని అతని ఉన్నతమైన సేవలను కొనియాడారు. మణికంఠ మాట్లాడుతూ అతని చరిత్రను పాఠ్య పుస్తకాలలో ప్రవేశపెట్టి, అతని విగ్రహాలను ఇంకా ఏర్పాటు చేయాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేసి సామాజిక చైతన్యానికి అలాగే, ఉన్నతమైన ఆలోచనలు కలిగేలా యువతను ప్రోత్సహించే విధంగా అతని కార్యక్రమాలు ఉండాలని అతను కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి మెట్టెల చైతన్య రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వంశీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అన్వర్ నాయకులు హరీష్, సిద్ధార్థ, భాను ,అరుణ్, సందీప్ తదితర ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

## మొయినాబాద్ ఫామ్ హౌజ్ డ్రగ్స్ కేసు.. కీలక నిందితులకు పోలీస్ కస్టడీ అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొయినాబాద్ ఫామ్ హౌజ్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డితో పాటు, ఆయన సోదరుడు పంజుగుల రితేష్ రెడ్డి, మరో నిందితుడు నమిత్ శర్మలకు కోర్టు మూడు రోజులపాటు పోలీస్ కస్టడీకి అనుమతి ఇచ్చింది. కోర్టు ఆదేశాల ప్రకారం, ఈరోజు సాయంత్రం నుండి 26వ తేదీ సాయంత్రం వరకు నిందితులను చంచల్‌గూడ జైలు నుండి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరపనున్నారు. ఈ విచారణలో డ్రగ్స్ మూలాలు, కాల్పుల ఘటనకు సంబంధించిన అంశాలు, అలాగే ఫామ్ హౌజ్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీపై కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.ప్రత్యేకంగా, రోహిత్ రెడ్డి విచారణలో నోరు విప్పితే కేసుకు సంబంధించిన పలు సంచలన విషయాలు బయటపడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఇక మరో కీలక కోణంగా, ఏలూరు టిడిపి ఎంపి పుట్టా మహేష్ యాదవ్‌ను ఈ పార్టీకి ఎందుకు ఆహ్వానించారన్న అంశంపై కూడా విచారణ జరగనుంది. ఆయన డ్రగ్స్ వినియోగించారా లేదా అనే విషయంపై కూడా పోలీసులు దృష్టి సారించనున్నట్లు సమాచారం.

## టిజిఎస్‌పిడిసిఎల్ సంస్థలో బిసి రిజర్వేషన్ల అమలుపై ఆరా

రాష్ట్ర బిసి కమిషన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్) కార్యాలయాన్ని సోమవారం బిసి కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి సోమవారం సందర్శించి, సంస్థలో రిజర్వేషన్ల అమలులో బిసిలకు జరిగిన అన్యాయాలతో పాటు ఇతర అంశాల గురించి సుదీర్ఘంగా విచారించడం జరిగిందని ఒక ప్రకటనలో తెలియజేశారు. 2014 నుంచి 2026 మధ్య జరిగిన నియామకాల వివరాలను బిసి కమిషన్‌కు ఇవ్వవలసిందిగా కమిషన్ ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, అలాగే వివిధ పెండింగ్ కోర్టు కేసులకు సంబంధించిన వివరాల గురించి సంస్థ ఒక కమిటీ వేసి ఉద్యోగుల ప్రమోషన్లు, సీనియారిటీ, ఇతర అంశాలను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు గతంలో ఏర్పాటు చేసిన బిసి సెల్ సంబంధించి వసతి ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ సంస్థ సిఎండి జితేష్ వి.పాటిల్, డైరెక్టర్ సి.హెచ్ చక్రపాణి, భాస్కర్, ముజిబుల్లా ఖాన్, కుమారస్వామి, కె. మనోహర్ రావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం

ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజంలో మార్పు కోసం భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలని ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ రామ్‌కోఠిలోని భగత్ సింగ్ విగ్రహానికి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... జాతీయ భావాలు, పోరాట సాంప్రదాయం కలిగిన కుటుంబం సర్దార్ భగత్‌సింగ్ ది అని అన్నారు. బ్రిటిష్ వలసదారుల దోపిడీ పరిపాలనను పారదోలి భారతదేశాన్ని విముక్తి చేయడం కోసం జరిగిన జాతీయ ఉద్యమంలో అనేకమంది బలిదానాలు చేశారని, అందులో విప్లవ విద్యార్థి యువజనులు తమ ప్రాణాలను తృణప్రాయం అర్పించారని, జైళ్లను, లాఠీలను, తూటాలను, ఉరికంబాలను చిరునవ్వులతో ముద్దాడిన సర్దార్ భగత్ సింగ్ విప్లవ ధ్రువతారని కొనియాడారు. దోపిడీ, పీడన లేని సమాజం కోసం విద్యార్థి, యువజనులు మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం నేడు ఏర్పడి ఉందని అన్నారు.
కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వరుసగా అధికారం చేపట్టి పన్నెండు సంవత్సరాలు కావస్తుంది. అయినా కూడా సమస్త రంగాలను సంక్షోభంలోకి నెట్టుతూ, ముఖ్యంగా జాతీయ నూతన విద్యా విధానం 2020 పేరుతో విద్యా రంగాన్ని కాషాయీకరణ చేస్తూ, కార్పొరేట్ కరణ చేస్తూ రిజర్వేషన్లకు పాతర వేస్తున్నారని మండిపడ్డారు. తెల్లదొరలు పోయి నల్ల దొరలు వస్తే ఆ స్వాతంత్ర్యం వట్టి బూటకం అని అప్పుడే భగత్ సింగ్ అన్నారు అని, భగత్ సింగ్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్క విద్యార్థి, యువత పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్ రెహమాన్ ,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చైతన్య యాదవ్, సామిడి వంశీవర్ధన్ రెడ్డి, అన్వర్, ఉప్పలఉదయ్ ,హరీష్ నాయకులు అరుణ్,భాను,వెంకటేష్, రంజిత్, శ్రీజ,జ్యోతి,అరుణ్, సిద్దు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడటమే..

# భగత్ సింగ్‌కు ఘనమైన నివాళి

ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మత ఉన్మాదానికి వ్యతిరేకంగా పోరాడటమే భగత్ సింగ్‌కు ఘనమైన నివాళి అని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు.ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతిని పురస్కరించుకొని నారాయణ గూడ నుండి హిమాయత్ నగర్ లోని సత్య నారాయణ రెడ్డి వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ఏర్పాటు చేసిన భారీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. భగత్‌సింగ్ లాంటి మహానుభావులు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి దేశానికి స్వేచ్ఛను అందించడానికి తమ ప్రాణాలను అర్పించారని గుర్తుచేశారు. ప్రైవేటీకరణ, కార్పొరేట్ విధానాలు పెరిగిపోవడంతో సాధారణ ప్రజలు నష్టపోతున్నారని, విద్య, ఆరోగ్యం వంటి రంగాలు పూర్తిగా వ్యాపారంగా మారిపోయాయని అన్నారు. భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్య హక్కులు క్షీణిస్తున్నాయని, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై దాడులు జరుగుతున్నాయని, వీటిని ఎదుర్కొనేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, సిపిఐ హైదరాబాద్ జిల్లా నాయకులు చెట్టుకింది శ్రీనివాస్, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ మహమూద్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్యాణ్, భగత్ సింగ్, మణి, శ్రవణ్, కుమార్, నరేష్, అరుణ్, రమ్య, షాలిని, మృణాలిని, కీర్తన లతో పాటు 20మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్ విద్యార్థి ‘క్షివ్ చకావే’ అరుదైన రికార్డ్

అండర్–6 చెస్ విభాగంలో ప్రపంచస్థాయిలో 10వ ర్యాంక్, ఇండియాలో 3వ ర్యాంక్ కైవసం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నారాయణ స్కూల్స్‌కి చెందిన చెస్ ప్రతిభావంతుడు క్షివ్ చకావే అసాధారణ విజయాన్ని నమోదు చేశాడు. ఫీడే, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ (ఎఐసిఎఫ్) గుర్తింపు పొందిన ప్రతిష్టాత్మక ‘ఎల్‌బిహెచ్‌ఎం ఆల్ ఇండియా ఓపెన్ ఫీడే రేటెడ్ చెస్ టోర్నమెంట్‌లో తన అత్యుత్తమ ప్రదర్శనతో క్షివ్ చకావే జాతీయ, అంతర్జాతీయ గుర్తింపును సాధించాడు.
అండర్6 విభాగంలో ప్రపంచంలోని టాప్ 10 క్రీడాకారులలో ఒకరిగా నిలవడమే కాకుండా, భారతదేశంలో 3వ ర్యాంక్‌తో పాటు మహారాష్ట్రలో తన వయస్సు విభాగంలో నెం.1 ర్యాంక్ క్రీడాకారుడిగా స్థానం దక్కించుకున్నాడు. ఈ విజయంపై నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి.సింధూర నారాయణ మాట్లాడుతూ ఇంత చిన్న వయస్సులో క్షివ్ సాధించిన ఈ విజయం కేవలం ఒక మైలురాయి మాత్రమే కాదు, ఇది అతని ఏకాగ్రత, పట్టుదల, చెస్ ఆట పట్ల ఉన్న మక్కువను ప్రతిబింబిస్తోందన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో భవిష్యత్ సిఎం బీసీనే

టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీలో బిసి ముఖ్యమంత్రి అవుతారని, బిజెపి అధ్యక్షులు రామచంద్రరావు, బిఆర్‌ఎస్ అధ్యక్షులు కెసిఆర్, కెటిఆర్‌లకు ఈ మాట చెప్పే ధైర్యముందా అని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బిజెపి నేతలు బిసి వ్యతిరేకులని ఆయన పేర్కొన్నారు. గాంధీ భవన్‌లో సోమవారం టిపిసిసి ఒబిసి సెల్ చైర్మన్‌గా షాద్‌నగర్ ఎంఎల్‌ఏ ఈర్లపల్లి శంకర్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ రావత్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్, ఎంఎల్‌ఏ నవీన్ యాదవ్, ఎంఎల్‌సి బసవరాజు సారయ్య, సీనియర్ నేత వి.హనుమంతరావు, మధుయాష్కి గౌడ్, కార్పొరేషన్ చైర్మన్లు నూతి శ్రీకాంత్, ఈరవర్తి అనిల్, మెట్టు సాయి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బిసిలలో ఐక్యత లోపం ఉంటే ఏదీ సాధించలేమన్నారు. బిసిలకు 65 శాతం చైర్మన్ల పదువులు, 60 శాతం ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు డిసిసి అధ్యక్ష పదవులు ఇవ్వగా, 67 శాతం బిసి సర్పంచ్‌లను గెలుపించుకున్నామని వివరించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు దేవుళ్ళ పేర్లు చెప్పడం తప్పబిసిలు గుర్తు రారని పేర్కొన్నారు. వీర్లపల్లి శంకర్ నేతృత్వంలోని ఒబిసి మరింత పార్టీ బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు. రానున్న ఎన్నికల్లో 100 సీట్లతో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయం ధీమా వ్యక్తంచేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బిసి సెల్ చైర్మన్ పదవి బాధ్యతలు స్వీకరించిన షాద్‌నగర్ ఎంఎల్‌ఏ ఈర్లపల్లి శంకర్,కన్వీనర్‌లు ధనలక్ష్మి , వెంకటేష్‌లకు అభినందనలు తెలిపారు.

**డీ లిమిటేషన్ జరిగితే 40 నుండి 50 సీట్లు మహిళలవే టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్**

డీ లిమిటేషన్ జరిగితే రాష్ట్రంలో 40 నుండి 50 అసెంబ్లీ సీట్లు మహిళలకు వస్తాయని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన హైదరాబాద్ గాంధీ భవన్‌లో సోమవారం జరిగిన మహిళా కాంగ్రెస్ మొదటి కార్యవర్గ సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేయడంతో పాటు యువతను ప్రోత్సాహించాలని చెప్పారు. ఒక్కో జిల్లా నుండి నలుగురు లేదా ఐదుగురిని నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పిస్తామని తెలిపారు. ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ లో నాయకులు మర్యాదలు ఇచ్చి పుచ్చుకోవాలని, కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టి, మహిళా సామర్థ్యాన్ని ప్రోత్సహించాలని అన్నారు. మహిళలు పురుషులలో సగ భాగం అని, మన హక్కుల కోసం మనం పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్మాణంలో మహిళలది కీలక పాత్ర అని చెబుతూ, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని, ఏ కష్టం వచ్చిన తనతో చెప్పాలని, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఇందుకోసం త్వరలోనే క్రమశిక్షణ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు ఆఫీస్ ఇంచార్జి, స్పోక్స్ పర్సన్ నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమలకు ఎపి సరైన వేదిక

యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి

ఎఎంఎన్‌ఎస్ శంకుస్థాపనలో ఎపి సిఎం చంద్రబాబు

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రాభివృద్ధి : కుమారస్వామి

**పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా):** పరిశ్రమల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ తిరుగులేని వేదికని, ఇక్కడ అన్ని రకాల వనరులు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద రూ.1.35 లక్షల కోట్లతో 8.2 ఎంపీటీఏ సామర్థ్యంతో ఆర్సెలార్ మిత్తల్, నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా ఏర్పాటు చేయబోయే ఉక్కు పరిశ్రమకు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు, పరిశ్రమ ప్రతినిధులతో కలిసి చంద్రబాబునాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో నక్కపల్లి కొత్త చరిత్ర సృష్టిస్తుందన్నారు. ప్రజాపోరాటం ఫలితంగా విశాఖ ఉక్కు ఏర్పడిందని, ఇక్కడ ఏర్పాటు చేసే ఉక్కు పరిశ్రమ అభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశ ఉక్కు రంగంలో ఉన్నతస్థాయిలో నిలిచిన ఆర్సెలార్ మిత్తల్, నిప్పాన్ స్టీల్ ఉక్కు పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కావడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో నక్కపల్లి ప్రాంతం తిరుగులేని ఉక్కుశక్తిగా మారుతుందని స్పష్టంచేశారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి నారా లోకేశ్‌కు, పరిశ్రమ ఏర్పాటుకు భూములిచ్చిన రైతులను సీఎం అభినందించారు.
2028 డిసెంబర్ నాటికి ఉక్కు ఉత్పత్తి ప్రారంభమవుతుందని చెప్పారు. ఉక్కు పరిశ్రమ కోసం నాలుగు లైన్ల రోడ్డు వేస్తారని, పైప్‌లైన్ల ద్వారా ముడి ఇనుము తెస్తారని, యువత కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చి, పరిశ్రమల ఏర్పాటు ద్వారా సంపద సృష్టించి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు పాలనలో ఉన్నాయని, తద్వారా రాష్ట్రాభివృద్ధి వేగవంతంగా జరుగుతోందన్నారు. విజనరీ నాయకుడు చంద్రబాబు అయితే... తండ్రికి తగ్గ తనయుడు, కార్యదీక్ష ఉన్న వ్యక్తి నారా లోకేశ్ అని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయంటే... అది కేవలం చంద్రబాబునాయుడు దార్శనికతను చూసేనన్నారు.
రూ.1.35 కోట్లతో ఏర్పాటవుతున్న ఉక్కు పరిశ్రమలో లక్ష ఉద్యోగాలు రావడం శుభపరిణామమన్నారు. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు 2200 ఎకరాలు ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు.



## భవిష్యత్ ప్రణాళికలకు దిక్సూచి ‘వాహన్’

పోర్టల్‌ను ప్రారంభించిన రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాహన్ పోర్టల్ ద్వారా దేశంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాహనాలపై ప్రభుత్వానికి ఖచ్చితమైన డేటా లభిస్తుందని, భవిష్యత్‌లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిర్వహణ వంటి ప్రణాళికల్లో మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి దిక్సూచిలా సహాయపడుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బేగంపేటలోని వరుణ్ మోటార్స్‌లో సోమవారం వాహన్ పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త వాహన రిజిస్ట్రేషన్, బదిలీ, పర్మిట్లు, ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు వంటి సేవలు ఇకపై ఆన్‌లైన్‌లో సులభంగా పూర్తి చేసుకోవచ్చన్నారు. అలాగే సోమవారం నుండి రెండవ వాహనం కొనుగోలు చేసే వారికి 2 శాతం అదనపు టాక్స్ రద్దు చేయడం జరిగిందని తెలిపారు. షో రూమ్‌లలో పారదర్శకంగా వాహనాల రిజిస్టేషన్ అయ్యేలా చేశామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రవాణా శాఖ చేస్తున్న సంస్కరణలు , రోడ్ సేఫ్టీపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణను అభినందించారని గుర్తుచేశారు. వాహన్ పోర్టల్ ద్వారా వాహనాలకు సంబంధించిన అన్ని వివరాలు ఒకే జాతీయ డేటా బేస్‌లో సమీకరించబడతాయని, దీని వల్ల సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్, రమేష్, శివలింగయ్య, ఎన్‌ఐసి ప్రతినిధి జగదీప్, వరుణ్ మోటార్స్ అధినేత వరుణ్, డిటిసిలు ఇతర రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ నుంచి తిరుపతికి కొత్త రహదారి

నకిరేకల్- నుండి ఏర్పేడు వరకు హైవే నిర్మాణ పనులు పూర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల మధ్య రోడ్డు మార్గంలో ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తూ మరో కీలకమైన జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చింది. తెలంగాణలోని నకిరేకల్ నుంచి ఎపిలోని తిరుపతి సమీపంలో ఉన్న ఏర్పేడు వరకు నిర్మించిన జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 565) ఇప్పుడు పూర్తిగా రాకపోకలకు సిద్ధమైంది. ఈ కొత్త రహదారి హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్65)ని, మదనపల్లెనాయుడుపేట జాతీయ రహదారి (ఎన్‌హెచ్71)తో అనుసంధానిస్తుంది. దీంతో తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి తిరుపతి వెళ్లే భక్తులకు, ప్రయాణికులకు ఇది ఒక సౌకర్యవంతమైన ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడనుంది. దాదాపు 420 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారిలో ఎక్కువ భాగం ఎపిలోనే ఉంది. తెలంగాణలోని నకిరేకల్, నల్గొండ, దేవరకొండ ప్రాంతాలను దాటిన తర్వాత పల్నాడు జిల్లా మాచర్ల వద్ద ఈ హైవే ఎపిలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి యర్రగొండపాలెం, మార్కాపురం, పొదిలి, కనిగిరి, రాపూరు, వెంకటగిరి మీదుగా ప్రయాణించి ఏర్పేడు వద్ద ముగుస్తుంది. ఏర్పేడు వద్ద ఎడమవైపు వెళ్తే శ్రీకాళహస్తికి, కుడివైపు తిరిగితే తిరుపతికి చేరుకోవచ్చు. ఈ రహదారి నిర్మాణం ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా వాసులకు ఎంతో ఊరటనిచ్చింది. గతంలో యర్రగొండపాలెం నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే పుల్లలచెరువు, వెల్దుర్తి మండలాల మధ్య ఉన్న అటవీ ప్రాంతం మీదుగా ప్రయాణం నరకాన్ని తలపించేది. ఘాట్ రోడ్డు అధ్వానంగా ఉండటంతో 20 కిలోమీటర్ల దూరాన్ని అధిగమించడానికి దాదాపు 50 నిమిషాలు పట్టేది. అయితే, ఇప్పుడు జాతీయ రహదారి నిర్మాణంతో ఆ కష్టాలు తీరిపోయాయి. రూ.393 కోట్ల వ్యయంతో ఈ మార్గాన్ని అభివృద్ధి చేయడంతో కేవలం 20 నిమిషాల్లోనే ఆ దూరాన్ని చేరుకోవచ్చు. ఘాట్ రోడ్డు కావడంతో ఈ మార్గంలో 16 వంతెనలు, 8 అండర్‌పాస్‌లు నిర్మించారు. అటవీ అనుమతుల వంటి అడ్డంకులు ఎదురైనా, పనులను వేగంగా పూర్తిచేసి గడువు కంటే ముందే అందుబాటులోకి తేవడం విశేషం. ఈ మార్గం కడప జిల్లాలోని పోరుమామిళ్ల ప్రాంత ప్రజలు హైదరాబాద్ వెళ్లడానికి కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. కొండలు, లోయల మధ్య నిర్మించిన ఈ రహదారి ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని పంచుతోంది.

## 28న జాతీయ లోక్ అదాలత్

డిజిపి శివధర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈనెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ సంఖ్యలో రాజీపడదగ్గ కేసులను పరిష్కరించేందుకు పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని డిజిపి బి. శివధర్ రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. శ్యామ్ కోషికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం డిజిపి హైకోర్టు న్యాయమూర్తి కి పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. తొలుత మార్చి 14న జరగాల్సిన ఈ అదాలత్ 28వ తేదీకి పునఃషెడ్యూల్ అయిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో చేస్తున్న ఏర్పాట్లను తెలియజేశారు. అదాలత్‌కు 10 రోజుల ముందు నుంచే, అంటే మార్చి 19 నుంచి 27 వరకు ప్రతిరోజూ 'డైలీ సిట్యుయేషన్ రిపోర్ట్ ద్వారా స్టేట్ క్రైమ్ రికారడ్స్ బ్యూరో, సిఐడి విభాగాలు కేసుల పురోగతిని పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. ఈ నివేదికలో గుర్తించిన రాజీపడదగ్గ కేసులు, జారీ చేసిన నోటీసులు ప్రీలోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైన కేసుల వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది మార్చి 8న 1,83,182 కేసులు, జూన్ 14న 1,93,439 కేసులు, నవంబర్ 15, డిసెంబర్ 21న 1,79, 964 కేసులు (స్పెషల్ లోక్ అదాలత్ కలిపి) పరిష్కారమయ్యాయని, ఈసారి ఆ సంఖ్యను మరింత పెంచేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డైరెక్టర్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో శిఖా గోయల్, శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్, అడిషనల్ డిజిపి సిఐడి చారు సిన్హా, ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు పాల్గొన్నారు.



## ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం

**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో 54వ వంశీ సిల్ వెల్ ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పూర్వ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణాచారి సినీ నటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సూర్య ధనుంజయ్, సినీనటి మంజు భార్గవి, రాధిక మంగిపూడి(ముంబై), నిర్వాహకులు వంశీ రామరాజు, శైలజ సుంకరవల్లి, శిరోమణి సుధామయి తదితరులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక రంగం, సినీ రంగం, ఇంజనీరింగ్, ప్రసార మాధ్యమాలు, పత్రికా రంగం, సాహిత్య రంగం, చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, సేవా రంగాల్లో ప్రముఖులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఇతర రాష్ట్రాల తెలుగు సంఘాల ప్రతినిధులకు. ప్రవాస భారతీయులకు, ఆదర్శ దంపతులకు పురస్కారాలను ప్రదానం చేయడం జరిగింది. ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌కు నట శిఖరం బిరుదును ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహిళల కవి సమ్మేళనం, సంగీత కార్యక్రమాలు, సినీ సంగీత విభావరి నిర్వహించారు. పత్రిక రంగంలో దేవులపల్లి అమర్, కుప్ప వెంకటకృష్ణ, మోహన్, ఓలేటి పార్వతీశంలకు పురస్కారాలను ప్రధానం చేశారు.

## పోరాట యోధుడు జఠావత్ నాయక్ వర్ధంతి



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట :** భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు జఠావత్ టన్ను నాయక్ వర్ధంతి జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన బీసీ సంఘాల నాయకుడు ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు జఠావత్ టన్ను నాయక్ త్యాగం మరవలేనిదని కొనియాడారు. రజాకార్లను ఎదిరించి, గిరిజన, హరిజన, బహుజనుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడన్నారు. జటావత్ టన్ను నాయక్ త్యాగాలకు గుర్తుగా ట్యాంక్‌బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేసి మహనీయుల వరుసలో గౌరవించి త్యాగాలను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శంకర్ నాయక్, శ్రీను నాయక్, రవి నాయక్, బీసీ సంఘాల నాయకులు, ఎస్సీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నీటి యుద్ధాలు రాకముందే మేల్కొందాం : హైడ్రా కమిషనర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు వచ్చే ప్రమాదం ఉందని, జలవనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అన్నారు. జెఎన్‌టియులో నిర్వహించిన వరల్డ్ వాటర్ డే వేడుకల్లో ఆయన ప్రసంగించారు. నగరంలో గతంలో ఉన్న 1300 చెరువుల్లో 700 మాయమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల పునరుద్ధరణ ద్వారా వరద ముప్పు తగ్గించడంతో పాటు భూగర్భ జలాలను పెంచుతున్నామని తెలిపారు. బడా బాబుల ఆక్రమణలు తొలగించి ఇప్పటివరకు 1350 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామన్నారు. హైడ్రా చర్యల వల్ల ప్రజల్లో ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లపై అవగాహన పెరిగిందన్నారు.

## అన్ని వర్గాల కోసం ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

**ప్రజాపక్షం/మలక్‌పేట్:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ తెలిపారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సోహైల్ ఆధ్వర్యంలో ముసారాంబాగ్‌లోని ఆయన నివాసంలో నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, మలక్‌పేట్ సీఐ పిడమర్తి నరేష్ తదితరులు హాజరై రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహ్మద్ సోహైల్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, సీఐ పిడమర్తి నరేష్‌లకు శాలువాలు కప్పి సన్మానించి పుష్పగుచ్చాలు అందజేశారు.

## పారదర్శక పాలనే లక్ష్యం

### సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పౌర సేవల్లో జవాబుదారీతనం, పారదర్శకత పెంచడమే లక్ష్యమని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ సృజన అన్నారు. అధికారులతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. జననమరణ ధృవీకరణ పత్రాలు, ఆస్తి పన్ను దరఖాస్తులను అనవసరంగా ఆలస్యం చేయకూడదని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై జరిమానాలు విధిస్తామన్నారు. అవినీతి విషయంలో జీరో టాలరెన్స్ పాటిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

## యువకుడి దారుణ హత్య

**ప్రజాపక్షం/సంతోష్‌నగర్:** మద్యం మత్తులో ఓ యువకుడిని తోటి స్నేహితులు హత్య చేసిన ఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు విచారణ చేపట్టారు. వివరాలలోకి వెళితే... సయ్యద్ లయాక్ (30) వ్యక్తిగతంగా బైక్ మెకానిక్. అతను గతంలో పిక్ పాకెట్, మొబైల్ చోరీలు, కేసుల్లో నిందితుడు. ఇతనికి తోడుగా సజ్జు, సల్మాన్, ముజీబు రెహమాన్, ముజ్జు, ఫైసల్, అధిల్ అందరూ కలిసి సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోయిన్ బాగ్ ఒక గదిలో మద్యం సేవించారు. ఈ సందర్భంగా వారి మధ్యన స్వల్ప వివాదం చోటుచేసుకోవడంతో మద్యం మత్తులో హత్య జరిగినట్టు పోలీసులు నిర్ధారించారు. నిందితులు ఆరుగురు పోలీసు కస్టడీలో ఉన్నారు.

## 25న జాబ్ మేళా

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** మల్లెపల్లి ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రాంగణంలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి ఎ.వందన ఒక ప్రకటనలో తెలిపారు. పిస్తా హౌజ్‌లో క్లీనింగ్ అండ్ హెల్పర్ పోస్టులు 50 ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ పోస్టులకు 18నుంచి40 సంవత్సరాల లోపు వయసు, పదవ తరగతి ఉత్తీర్ణులై ఉన్న వారు అర్హులని ఆమె పేర్కొన్నారు. వీటితో పాటు ఎల్ఐసి ఆఫ్ ఇండియాలో ఎల్ఐసి ఏజెంట్ పోస్టులు 50 ఖాలీలు ఉన్నాయన్నారు. వీటికి 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు ఉండి పదవ తరగతి నుండి డిగ్రీ వరకు చదివిన వారు అర్హులని ఆమె చెప్పారు. అర్హులైన వారు ఈ నెల 25న ఉదయం 11గంటలకు మల్లెపల్లి ఐటిఐ కళాశాలలో జరుగు జాబ్ మేళాకు హాజరు కావాలని ఆమె తెలిపారు.

# శ్రీరామనవమి శోభాయాత్రకు ఏర్పాట్లు

### 3 వేల మందితో పోలీసు బందోబస్తు
### అడుగడుగునా సిసి కెమెరాలు, డ్రోన్లతో నిఘా
### శోభాయాత్ర ఏర్పాట్లపై కొత్వాల్ సజ్జనార్ స్పష్టత




**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** అత్యంత కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో శ్రీరామనవమి శోభాయాత్రను నిర్వహించాలని వివిధ శాఖలకు చెందిన అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సీతారాంబాగ్‌లోని ద్రౌపది గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన అధికారుల సమన్వయ సమావేశంలో కొత్వాల్ వీసీ సజ్జనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు శోభాయాత్ర ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలు, బందోబస్తుపై దిశానిర్దేశం చేశారు. 2010లో ప్రారంభమైన ఈ యాత్ర అతి తక్కువ కాలంలోనే దేశవ్యాప్త గుర్తింపు పొందిందని, సీతారాం బాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే ఈ వేడుకను భక్తులు భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో జరుపుకోవాలని కొత్వాల్ సజ్జనార్ కోరారు. భద్రత కోసం సుమారు 3 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, అడుగడుగునా సీసీ కెమెరాలు, డ్రోన్ల నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా చైన్ స్నాచింగ్ వంటి నేరాలు జరగకుండా క్రైమ్ టీమ్స్, మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ నిరంతరం నిఘా ఉంచుతాయని తెలిపారు. గతేడాది వాహనాల బ్రేక్‌డౌన్ వల్ల యాత్ర నెమ్మదించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఈసారి అలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. శోభాయాత్రను మధ్యాహ్నం 1 గంటకల్లా ప్రారంభించాలని, ఇరుకైన మార్గాల్లో పెద్ద వాహనాల వల్ల ఇబ్బంది తలెత్తకుండా ముందస్తుగా ట్రయల్ రన్ నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. శబ్ద కాలుష్యం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని, డీజేలకు బదులుగా సాధారణ సౌండ్ సిస్టమ్ వాడాలని, ఇతర వర్గాల మనోభావాలు దెబ్బతినకుండా పాటలు, ప్రసంగాలు ఉండాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు డ్రోన్లు వాడాలనుకుంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ప్రజలు, ఉత్సవ సమితి సభ్యులు పోలీసులకు సహకరించి శోభాయాత్రను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా బల్దియా బాస కర్ణన్ మాట్లాడుతూ.. భక్తులకు అసౌకర్యం కలగకుండా రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటును ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. శోభాయాత్రలో పాల్గొనే వాహనాల ఎత్తు విషయంలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వాహకులు భగవంతరావు, గోవింద్ రాఠి, ఆనంద్ సింగ్, కృష్ణ, శశికల (మాజీ కార్పొరేటర్), లాల్ సింగ్ (మాజీ కార్పొరేటర్) అందరూ శోభాయాత్ర సందర్భంలో ఎదురయ్యే సమస్యలను ప్రస్తావించగా.. దీనిపై సీపీ స్పందిస్తూ అన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శోభాయాత్ర వెళ్లే రూట్‌ను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి సీపీ పరిశీలించారు.సమావేశంలో అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీలు జోయల్ డేవిస్, ఎన్.శ్వేత, గోల్కొండ జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ప్రతి వీధికి స్వచ్ఛ ఆటో వెళ్లాల్సిందే

### కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో 100 శాతం చెత్త సేకరణే లక్ష్యంగా పనిచేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. నాచారం, మల్లాపూర్ ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్‌లను సందర్శించిన ఆయన, స్వచ్ఛ ఆటోల పనితీరును సమీక్షించారు. ఏదైనా ఆటో అందుబాటులో లేకపోతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఏ ఒక్క వీధిలోనూ చెత్త పేరుకు పోకుండా చూడాలని స్పష్టం చేశారు.



## బిసి కులవృత్తుల కవితల సదస్సు

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** బిసి సాహితీ వేదిక ఆధ్వర్యంలో బీసీ కుల వృత్తుల దీర్ఘ కవితల సదస్సును సంగిశెట్టి శ్రీనివాస్, వనపట్ల సుబ్బయ్య టీమ్ రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్లో అనిశెట్టి రజిత వేదికపై నిర్వహించారు. ఇందులో ప్రముఖ బీసీ రచయితలు పాల్గొన్నారు. మార్చి 22వ తేది ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అద్భుతంగా నాలుగు సెషన్స్‌గా జరిగిన సదస్సులో ప్రముఖులు పాల్గొన్నారు. మొదటి సెషన్‌లో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న బహుళ సంపాదకురాలు జ్వలిత మాట్లాడుతూ, బిసి కవుల సాహిత్యం పాఠ్యపుస్తకాలలో చేర్చాలని.. విశ్వవిద్యాలయ స్థాయిలో చేర్చదగిన సాంద్రత కలిగిన సాహిత్యాన్ని బీసీ కవులు సృష్టించారని.. బీసీలను సామాజికంగా ఆర్థికంగానే కాకుండా సాహిత్య పరంగా కూడా వెనుకకు నెట్టేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుట్రలను గుర్తించి ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా బీసీలు స్థిరంగా ఆత్మవిశ్వాసంతో ఉండాలన్నారు. ఏ సాహిత్యమైన ప్రజాసంక్షేమాన్ని కోరుతుందని, బీసీల అంతిమ లక్ష్యం రాజ్యాధికారంలో తమ వాటాను అందిపుచ్చుకునే దిశగా ఉండాలని అన్నారు. సదస్సులో పాల్గొన్న పులికొండ సుబ్బాచారి, జూలూరు గౌరీ శంకర్, పిల్లలమర్రి శ్రీరాములు, కాంచనపల్లి గోవర్ధన్ రాజు, తిరునగరి దేవకీదేవి, కందుకూరి శ్రీరాములు అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు.

# బడ్జెట్‌లో బిసిలకు అన్యాయంపై చలో అసెంబ్లీ



### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల నిర్ణయం

**ప్రజాపక్షం/సోమాజిగూడ:** బడ్జెట్‌లో బిసిలకు జరిగిన అన్యాయానికి నిరసనగా చలో అసెంబ్లీకి పిలుపునివ్వనున్నట్టు పలువురు బిసి సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. త్వరలో అన్ని బిసి సంఘాలను కలుపుకొని ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'బిసిలకు మరో మోసం –2026 బడ్జెట్' అనే అంశంపై బిసి జనసభ అధ్యక్షులు డి.రాజారాం యాదవ్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశంజరిగింది. శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి మాట్లాడుతూ బిసి ఉద్యమం పల్లెలకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉన్నదన్నారు. బిసి సబ్‌ప్లాన్ చట్టబద్ధత చేస్తే రూ.50వేల కోట్లు కేటాయించాల్సి ఉంటుందని, అందుకే ప్రభుత్వం దానిపై నిర్లక్ష్యంచూపుతుందని విమర్శించారు. మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ త్వరలోనే జిల్లాల వారీగా కలెక్టరేట్‌లను ముట్టడిస్తామన్నారు. బిసిల పట్ల కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని రౌండ్‌టేబుల్ సమావేశాల ద్వారా ఎండగడతామన్నారు. బిసి ఇంటెలెక్చువల్ ఫోరంచైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు మాట్లాడుతూ ప్రభుత్వాలు బిసిల పట్ల చిత్తశుద్ధి కనబర్చడం లేవని మండిపడ్డారు. సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల, గ్రామస్థాయిలో బడ్జెట్ ప్రతుల దహనం చేపడుతామన్నారు. రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బిసిల వ్యతిరేక ప్రభుత్వామని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్, విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 రిజర్వేషన్ల హామీలు నెరవేర్చకుండా బిసిలను నమ్మకద్రోహం చేసిందని విమర్శించారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నేతలు మేకల రాములు యాదవ్, యాదయ్యగౌడ్, కాటం నర్సింహులు,భేరి రాంచందర్ యాదవ్, సాయన్న ముదిరాజ్, బలిజ రమేశ్, లోడంగి గోవర్ధన్., వీరేశం, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్‌ల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

### రైల్వే జిఎం సంజయ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే ట్రాక్‌ల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ ఆదేశించారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైలు కార్యకలాపాల భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా కీలక సమీక్షా సమావేశం సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగింది. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ శాఖల ప్రధానాధికారులు పాల్గొన్నారు. జోన్ పరిధిలోని సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డిఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొని భద్రతా అంశాలపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీవాస్తవ మాట్లాడుతూ రైలు భద్రతకు సంబంధించి సమస్యల పరిష్కారంలో క్రమబద్ధమైన, దశలవారీ విధానం అనుసరించాలని స్పష్టం చేశారు. అనివార్య సంఘటనలను నివారించేందుకు ట్రాక్‌ల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా పాయింట్లు క్రాసింగ్‌లు, అలారమ్ వ్యవస్థల వద్ద నిరంతర తనిఖీలు, భద్రతా డ్రైవ్‌లు చేపట్టాలని సూచించారు. ట్రాక్ సమీపంలో పనులు నిర్వహించే సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పని స్వభావాన్ని బట్టి హెచ్చరిక ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా రైల్వే ప్రాంగణంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా పరికరాల నిర్వహణపై దృష్టి పెట్టాలని సూచించారు. నాన్‌ఇంటర్‌లాక్డ్ లెవెల్ క్రాసింగ్ గేట్ల పరిస్థితిని కూడా సమీక్షించిన ఆయన, జోన్ అంతటా రైలు ఫిట్టింగ్‌ల నాణ్యతపై అధికారులను అప్రమత్తం చేశారు. మొత్తం మీద, రైల్వే భద్రతను మరింత కట్టుదిట్టం చేయడమే లక్ష్యంగా ఈ సమీక్షా సమావేశం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

## ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్

### ప్రారంభ వేడుకలకు గవర్నర్‌ను ఆహ్వానించిన డిజిపి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించనున్న 74వ బి.ఎన్.మల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్2026 ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి సోమవారం లోక్ భవన్ లో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తున్న పోలీసు జట్ల వివరాలను డిజిపి గవర్నర్‌కు వివరించారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మెగా టోర్నీ బుధవారం (25న) మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుంది. ఈ వేడుకల్లో భాగంగా వివిధ రాష్ట్రాల పోలీసు బృందాల గౌరవ వందన స్వీకరణ, క్రీడాకారుల మార్చ్ పాస్ట్, ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ పతాకావిష్కరణ వంటి కార్యక్రమాలు ఘనంగా జరగనున్నాయి. గవర్నర్ ఈ క్రీడలను అధికారికంగా ప్రారంభించనుండగా, ప్రత్యేక కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పాటు కేంద్ర భద్రతా బలగాల నుంచి అత్యుత్తమ ఫుట్‌బాల్ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఈ వేదిక సిద్ధమైంది. క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వివిధ రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు ఈ పోటీలు దోహదపడనున్నాయి. ఈ కార్యక్రమంలో పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, స్పోర్ట్స్ ఐజిపి గజరావు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## యువత భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని ఆచరించాలి

### వర్ధంతి సభలో వక్తలు




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తి నేటి యువత అలవర్చుకోవాల్సిన ఆవశ్యకత పెరిగిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, జావీద్ అధ్యక్షతన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భగత్ సింగ్ 59వ వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా నారాయణగూడ నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు యువజన విద్యార్థి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎస్వీకేలో జరిగిన సభలో ప్రముఖ సినిమా కళాకారుడు పసునూరి శ్రీనివాసరావు, సినీయాక్టర్ పూజ, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు కిరణ్ రెడ్డి, సుప్రజ ఆస్పత్రి ఎండి విజయ్ కుమార్, ఎన్‌డిఆర్ ఫౌండేషన్ చైర్మెన్ మల్లేశ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, మాజీ నాయకుడు ఎం మహేందర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు లెనిన్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు రాజయ్య సునీల్, రజనీకాంత్, ప్రశాంత్, నాగేందర్, అర్జున్, ప్రవీణ్, గోపి, మనోజ్ మాజీ నాయకులు శ్రీనివాస్‌రావు, వెంకటేష్, వాణి, రేణుక, కృష్ణస్వామి, పాషా, రాములు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## గ్లో బై కీర్తిలాల్స్‌కు 'ఎమర్జింగ్ బ్రాండ్ ఆఫ్ ది ఇయర్' అవార్డు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రముఖ ఆభరణాల సంస్థ 'గ్లో బై కీర్తిలాల్స్' మరో గౌరవాన్ని దక్కించుకుంది. బెంగళూరులో జరిగిన రిటైల్ జ్యువెల్లర్ ఇండియా ఫోరమ్2026లో ఎమర్జింగ్ బ్రాండ్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకుంది. ఆధునిక డిజైన్లు, తక్కువ బరువుతో రోజువారీ వాడకానికి అనువైన వజ్రాభరణాలను అందిస్తున్నందుకు గానూ ఈ గుర్తింపు లభించింది. త్వరలో మదురై, చెన్నైలలో కొత్త స్టోర్లను ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.



## శాస్త్రీయ, సాంప్రదాయ కళలు భావితరాలకు అవసరం

### నర్తనం ఆర్ట్స్ మూడో వార్షికోత్సవంలో మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/సోమాజిగూడ:** శాస్త్రీయ సాంప్రదాయ కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రముఖ భరతనాట్య శిక్షణ సంస్థ 'నర్తనం ఆర్ట్స్' మూడో వార్షికోత్సవం సందర్భంగా శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ విచ్చేసి, మాట్లాడారు. మన సంస్కృతిని , కళలను కాపాడటంలో నర్తనం ఆర్ట్స్ చేస్తున్న కృషిని అభినందించారు. నర్తనం ఆర్ట్స్ డైరెక్టర్, ప్రముఖ భరత నాట్య నృత్యకారిణి 'బాలశ్రీ' అవార్డు గ్రహీత వర్షిణి సారథ్యంలో దాదాపు 100 మందికి పైగా విద్యార్థులు భరత నాట్యంలో శిక్షణ పొందటం సంతోషదాయకమన్నారు. సభకు ముందు కళాకారులు ప్రదర్శిన నృత్య రూపకాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టు చలనచిత్ర విశ్లేషకులు డా.పి.రవిచంద్ర, కూచిపూడి నృత్యకారిణి, నటి కృష్ణవేణి, కొరియోగ్రాఫర్ ఆనీ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ద్వారా సమస్యలు పరిష్కారం

**ప్రజాపక్షం/చార్మినార్:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ జెడ్‌సీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజావాణిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. చార్మినార్ జోన్ పరిధిలోని సంతోష్‌నగర్, యాకుత్‌పురా, మలక్‌పేట్, చార్మినార్, ముసారంబాగ్ సర్కిళ్ల పరిధిలోని ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజావాణి కార్యక్రమంలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తమకు అందిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జోనల్ ఏయంసీ రాజారావు, సీనియర్ అసిస్టెంట్లు హమీద్, రాజేష్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను ఎగవేతదారులపై.. జిహెచ్‌ఎంసి ఉక్కుపాదం

### బకాయిలదారుల ఆస్తుల సీజ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆస్తి పన్ను మొండి బకాయిదారులపై జిహెచ్‌ఎంసి అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. టాప్ డిఫాల్టర్‌లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశించడంతో డిప్యూటీ కమిషనర్లు క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగారు. 2017 నుంచి రూ. 6.16 కోట్ల పన్ను బకాయి ఉన్న ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని క్షత్రియా హోటల్‌ను అధికారులు జప్తు చేశారు. రూ. 36 లక్షల బకాయి పడ్డ గోషామహల్ సర్కిల్ పరిధిలోని స్వర్ణ ట్రాన్స్‌పోర్ట్‌ను అధికారులు సీజ్ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లోని షమీమ్ సుల్తానా క్లాత్ మాల్ రూ. 35.27 లక్షల బకాయి ఉన్నందుకు జూబ్లీహిల్స్ సర్కిల్ అధికారులు దానిని సీజ్ చేశారు. రెవెన్యూ అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్ ప్రియాంక అలా పర్యవేక్షణలో డిప్యూటీ కమిషనర్లు ఎన్. శంకర్, బి. శ్రీనివాస్, ఉమాప్రకాష్ ఈ దాడులు నిర్వహించారు.

**ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ రాయితీ : కమిషనర్**

పాత ఆస్తి పన్ను బకాయిలు ఉన్నవారు ప్రభుత్వం కల్పించిన వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటిఎస్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సూచించారు. ఈ నెల 31వ తేదీలోపు బకాయిలు చెల్లించే వారికి వడ్డీపై 90 శాతం రాయితీ లభిస్తుందని ఆయన తెలిపారు. కేవలం ఆన్‌లైన్ ద్వారా (www.ghmc.gov.in, My GHMC App) లేదా మీసేవా కేంద్రాల్లో మాత్రమే పన్ను స్వీకరిస్తామని స్పష్టం చేశారు. గడువులోగా చెల్లించని పక్షంలో చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## ఫార్మాసిటీ, గ్రీన్ ఫీల్డ్ రోడ్డుతో గిరిజనులకు అన్యాయం

పర్యావరణ వేత్త కవుల సరస్వతీ



**ప్రజాపక్షం/యాచారం :** ఫార్మాసిటీ పేరుతో గత ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేసి బలవంతంగా భూసేకరణ చేసిందని పర్యావరణ వేత్త కవుల సరస్వతి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం 7 వ రోజు రిలే నిరహారదీక్షలు చేపట్టారు. రైతులకు మద్దతుగా పర్యావరణ వేత్త కవుల సరస్వతి, పర్యావరణ ఉద్యమ నాయకులు కానమోని గణేశ్, మహిపాల్‌రెడ్డి, నేనావత్ శ్రీకాంత్, భగవత్‌రెడ్డి, అనసూయమ్మలు మంగలి గడ్డ తండా మర్ల కుంట తండా రైతులు చేస్తున్న నిరహార దిక్షలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కవుల సరస్వతి మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కార మయ్యే వరకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ అధ్యక్షులు రఘురామ్‌రాథోడ్, సింధం రవి,ఉడుతల పేంటయ్య,భూర సత్తయ్య,అందుకార్ దేవోజి రైతులు పాల్గొన్నారు.

## బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మీడియా పేరుతో బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న వారిపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని టియుడబ్ల్యుజె (ఐజెయు) షాద్‌నగక్ డివిజన్ అధ్యక్షుడు బూర్గుల ఫణీంద్ర కోరారు. సోమవారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు బూర్గుల ఫణీంద్ర మాట్లాడుతూ మీడియా పేరుతో సోషల్ మీడియా వేదికా బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న వారిపై పోలీసులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియా ముసుగులో మోసాలకు పాల్పడుతూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని వివరించారు. అలాంటి నకిలీ మీడియా విలేకరులను గుర్తించి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) డివిజన్ ఉపాధ్యక్షుడు మల్లిఖార్జున్ నాయక్, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇలియాస్, సంయుక్త కార్యదర్శి అల్వాల దర్శన్ గౌడ్, కార్యవర్గ సభ్యులు మహ్మద్ సమిలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ప్రజలు మెగా ఉచిత వైద్యా శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నరేష్ గౌడ్ సూచించారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామంలో 99వ రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యా కేంద్రం ఆద్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపును గ్రామ సర్పంచ్ నరేష్‌గౌడ్ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఎచ్ఒ లక్ష్మి ప్రసన్న, డాక్టర్లు దివ్యా, వై ప్రావలి, వీరా ప్రసాద్, సుసిమాశ్రీ , వైశాలి, సారయు, సంఘవి, రామయ్య, హెమ్‌లాల్, నిర్మల, మనిసురేష్, రఘు, ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## టెండరయిన పనులు పూర్తి చేయండి

మాజీ కార్పొరేటర్ కొప్పుల



**ప్రజా పక్షం/హయత్ నగర్ :** పాత మన్సూరాబాద్ డివిజన్ లో టెండర్ పూర్తి అయ్యి పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయాలని ప్రజా వాణిలో జోనల్ కమిషనర్,ను కలిసిన మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి. హయత్ నగర్ లోని ఆటోనగర్ సెక్షన్ జలమండలి కార్యాలయం ఎల్.బి నగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో డివిజన్లోని టెండర్ పూర్తయి పెండింగ్లో ఉన్న భూగర్భ డ్రైనేజీ ఇన్నర్ లైన్ల పనులు, వీరన్న గుట్టలో కొనసాగుతున్న సి .సి రోడ్డు పనులతో పాటు ఇంకా మిగిలి ఉన్న రామాలయం పక్కన వీధులలో సి.సి రోడ్డు పనులను పూర్తి చేయాలని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మహిళలతో కలిసి మాజీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ప్రజావాణి కార్యక్రమంలో యమ్ యమ్ సి ఎల్.బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ జలమండలి అధికారులు సీజీమ్ నాగేందర్ కి డివిజన్లో ఉన్న సమస్యలను క్షుణ్ణంగా వివరించి అతి తొందరగా పరిష్కరించాలని కోరడంతో కోరారు అధికారులు సానుకూలంగా స్పందించిన్నారు అని తెలిపినారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పొట్లపెల్లి సాయిరాం గౌడ్ పరంద సాయిరాం వెంకులు యాదవ్ వివిధ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ వీరత్వం ఆదర్శం

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** 23 ఏళ్ల వయస్సులో దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్ వీరత్వం నేటి తరానికి ఆదర్శమని శంకర్‌పల్లి మండలం గోపులారం మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్ అన్నారు. భగత్ సింగ్ వర్థంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి తలవంచని భగత్ సింగ్ శౌర్యం, దేశభక్తి తరాల తరబడి స్ఫూర్తినిస్తుందని పొడవు శ్రీనివాస్ అన్నారు.

# సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటమే అమరులకిచ్చే నివాళి

సిపిఐ రాష్ట్ర నాయకులు రవీంద్ర చారి, యాదిరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రపంచ దేశాలపైన అధిపత్యం చేస్తున్న అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటమే మనం అమరులకి ఇచ్చే గొప్ప నివాళి అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. సోమవారం స్వాతంత్ర పోరాట యోధులు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతి సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం రావి నారాయణ రెడ్డి కాలనీ ఫజ్ 3, భూ పోరాట కేంద్రంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు మధు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆందోజు రవీంద్రచారీ, ముత్యాల యాదిరెడ్డి హాజరై భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, దాసరి ప్రసాద్, సైదులు ముదిరాజ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, గణేష్, పేరాల గోపి, బిచ్చునాయక్, యాదగిరి, శ్రీధర్‌రెడ్డి, అశోక్, పాండు, నీల, ప్రియా, అన్నపూర్ణ, రాణి, నర్సింహా, లక్కీ, పాండు నాయక్, దశరథ్ పవర్, మధుసూర్ తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** విప్లవ వీరుల ఆశయాలను కొనసాగించడంలో యువత ముందుండాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ అన్నారు. షాద్‌నగర్‌లో భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురుల వర్ధంతి పురస్కరించుకొని జెవివి కురుమయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ విగ్రహాన్ని అవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, మండల విద్యాధికారి మనోహర్, జెపిపి రాష్ట్ర కార్యదర్శిపి.వెంకటరమణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.రాజు, టిఎస్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నర్సింలు, జెఏసి నాయకులు జనార్ధన్, శ్రీనునాయక్, ఈశ్వర్‌నాయక్, ఆకాష్ నాయక్, లక్ష్మణ్‌కుమార్, వివిధ ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

**హయత్ నగర్:** భగత్ సింగ్‌కు "భారత రత్న" ప్రకటించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురుల వర్ధంతిని హయత్‌నగర్‌లో నిర్వహించారు. ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ హయత్‌నగర్ మండల సమితీల ఆధ్వర్యంలో బొంగు అరుణ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన మండల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య సామిడి వంశి వర్ధన్ రెడ్డి, జిల్లా గర్ల్స్ కన్వీనర్ కాటి శ్రావణి హాజరై భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింత వెంకటేష్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి మర్రి శోభన్, మండల సహాయ కార్యదర్శి వీరన్న, ఈనపల్లి ఉపేందర్, జిన్నె బన్నీ, గుమ్మడివల్లి గణేష్, గుమ్మడివల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

**రంగారెడ్డి :** ఎఐవైఎఫ్ రాజేంద్రనగర్ మండల సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్‌గురుల వర్ధంతిని సిపిఐ మండల కార్యాలయం ఎఆర్ దేవరాజ్ భవన్‌లో సోమవారం నిర్వహించారు. సమావేశానికి ఎఐవైఎఫ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి హాజరై భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల నాయకులు పి.రాణి, ఎన్.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, మహేందర్, గంగారం, మంగ, సునీత. వి.మల్లేష్, జి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌బి నగర్ :** దేశ స్వాతంత్ర ఉద్యమంలో వీర కిశోరాలు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల పోరాటం నేటి యువ తరానికి ఆదర్శమని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహ అన్నారు. సోమవారం సరూర్ నగర్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ప్రవీణ్ కుమార్ గౌడ్, గోపాల్, జిల్లా కృష్ణ, ఎండి మహబూబ్, నరసమ్మ, సాయి, సాహెద్, ప్రసాద్, అమీద్. పరుశురాం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.









## రెండు సంవత్సరాలు గడిచినా అమలు చేయని 6 హామీలు

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోతున్న ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చలేకపోతున్నదని శంకర్ పల్లి మాజీ సర్పంచ్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు బిసోళ్ళ శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.2000 ఇస్తున్న పింఛన్లను పెంచి 4000 రూపాయలు ఇస్తామని ఎన్నికల సమయంలో పేర్కొన్నారని, అయితే ఇప్పటివరకు పెన్షన్లు పెంచలేదని విమర్శించారు. అలాగే రైతులకు ఇస్తామన్న రైతు భరోసా మొత్తం ఇవ్వకుండా మధ్యలో ఆపి ప్రస్తుతం ఇవ్వడం ఎంతవరకు సమంజసం మనీ ఆయన ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ అని అన్నారని, అందులో కొంతమంది రైతులకు కేవలం లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలలో కేవలం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి, మగవారికి టికెట్లు రెండింతలు పెంచారని ఆరోపించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఇస్తానన్న తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. మహిళలకు 2500 రూపాయలు ఇస్తామని చెప్పిన మాట కూడా ఒట్టిదే అయిందని తీవ్రంగా విమర్శించారు. అన్ని రంగాలలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతుందని తెలిపారు.

## అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 53 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దారులు, కలెక్టరేట్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతపై బిఆర్ఎస్ శ్రేణుల నిరసన



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** గ్యాస్ సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరి నేపంతో నాటకాలు అడుతూ ప్రజల మోసం చేస్తుందని ఎల్‌బి నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు విమర్శించారు. సోమవారం ఎల్‌బి నగర్ చౌరస్తాలో ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్యాస్ అందక ప్రజలు పడుతున్న ఇబ్బందులకు నిరసనగా గ్యాస్ బండలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, సంగీత ప్రశాంత్‌గౌడ్, జిట్టా రాజశేఖర్ రెడ్డి, పద్మశ్రీనివాస్ నాయక్, తిరుమల్‌రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్, జిన్నారం విఠల్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, గజ్జల మధుసూదన్‌రెడ్డి, ఆందోజు సత్యంచారి, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, వరప్రసాద్, చింతల రవికుమార్ గుప్తా, శ్రీధర్‌గౌడ్, రాజిరెడ్డి, మల్లారెడ్డి, సయ్యద్ పాష తదితరులు పాల్గొన్నారు.

**హయత్ నగర్ :** గ్యాస్ కొరతపై ఎల్‌బినగర్ బిఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం ఎల్‌బినగర్ చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విట్టల్‌రెడ్డి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, జిట్టా రాజశేఖర్ రెడ్డి, పద్మశ్రీనివాస్ నాయక్, సామ తిరుమల రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్, జిన్నారం విఠల్ రెడ్డి, ఆనంతుల రాజిరెడ్డి, రవిముదిరాజ్, రంగేశ్వరి నాయిడు, కటికరెడ్డి అరవింద్ రెడ్డి, సత్యంచారి, వరప్రసాద్ రెడ్డి, లింగాల రాహుల్ గౌడ్, చింతల రవికుమార్, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తే అరెస్టులు చేయడం సరికాదు

మాజీకార్పొరేటర్లు కొప్పుల నర్సింహ్మారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** ప్రభుత్వం వైఫల్యాలపై నిలదీస్తే అరెస్టులు చేయడం సరికాదని మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు. బిజెపి రాష్ట్ర కమిటీ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి మాజీ స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి వెళుతుండగా ముందస్తు అరెస్టులు చేశారు.

**ఎల్‌బి నగర్:** ప్రభుత్వం వైఫల్యాలపై నిలదీసేందుకు వెళుతున్న నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సరికాదని బియన్‌రెడ్డి నగర్ డివిజన్ తాజా, మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం బిజెపి తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి ముందస్తుగా వనస్థలిపురం పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తమ హక్కులను నిరసన తెలిపి హక్కు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వారి హక్కులను కాలరాయడం హేయమైన చర్య అని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వాలు విఫలం

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం:** ప్రజా సమస్యలు పరిష్కరించటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ప్రజా సమస్యలు పరిష్కారించాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య చేపట్టే ఛలో జిల్లా కల్లెక్టరేట్ కార్యాలయం కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యదర్శి ముఖ్య అతిథులుగా హాజరై పాదయాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ రామోజీ ఫిలిం సిటీలో పేదలకు ఇళ్ళ స్థలాలు, ఫింఛన్లు, ఉపాధి కూలీల, భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో వామపక్ష పార్టిలు ఉద్యమించి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తొలగించాలని ప్రయత్నిస్తున్నదని అన్నారు. ప్రజా సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్, రామచంద్రయ్య, పి అంజయ్య, స్వామేల్, డి జగదిష్, జగన్, శ్రీనివాస్ రెడ్డి, గోరెంకల నర్సింహ్మా, సిఎచ్ శంకర్, యెల్లేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బడుగుల నాయకత్వాన్ని పెంచడమే లక్ష్యం

రాష్ట్ర ఒబిసి విభాగం చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బడుగు బలహీన వర్గాల నాయకత్వాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేస్తానని రాష్ట్ర ఒబిసి విభాగం చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఒబిసి సెల్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేస్తుందని, పేద సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని వివరించారు. వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతోనే ఒబిసి సెల్ ఏర్పాటు చేశారన్నారు.

### మ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానించిన శ్రేణులు

నిబద్ధతకు నిదర్శనం..ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వీర్లపల్లి శంకర్ పని చేస్తున్నారని మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సయ్యద్ సాధిక్, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, సిపిఐ సర్పంచ్ శ్రీనునాయక్ అన్నారు. సోమవారం హైద్రాబాద్‌లోని గాంధీభవన్‌లో టిపిసిసి ఓబిసి విభాగం చైర్మన్‌గా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పుష్పగుచ్ఛం అంధించి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



**కేశంపేట:** ఓబిసి విభాగం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మాజీ జడ్పిటిసి తాంద్ర విశాల శ్రావణ్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పూలబొకే అంధించి శుభాకాంక్షలు తెలిపారు.







## సాయిసుధీర్ కళాశాలలో 'ట్రై ఇంపాక్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభోత్సవం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయిసుధీర్ డిగ్రీ అండ్ పిజి కళాశాలలో ట్రై ఇంపాక్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకృష్ణారెడ్డి, కమినరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ పి. బాలభాస్కర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కళాశాల మేనేజ్‌మెంట్ చైర్మన్, రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ డైరెక్టర్ మెమొరండం ఆఫ్ అండర్ స్టాండింగ్ పత్రాన్ని మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ప్రదర్శనలు వినూత్నంగా ఉన్నాయని విద్యార్థులు రిసెర్చ్‌లో పాల్గొని కళాశాలకు, తల్లిదండ్రులకు, దేశానికే గర్వకారణంగా నిలవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ డైరెక్టర్ కొనకల్ల సూర్యప్రకాశ్‌గౌడ్, రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ ఫౌండర్, డెరెక్టర్ నాగేంద్ర, కళాశాల చైర్‌పర్సన్ ఉషారాణి, ప్రిన్సిపాల్ మీరారాణి, పద్మ, మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



## రెండవసారి ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా లింగాల భూపాల్ విజయం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు సోమవారం నిర్వహించగా అధ్యక్షుడిగా లింగాల భూపాల్ ఘనవిజయం సాధించారు. మొత్తం 12 ఓట్లతో ప్రత్యర్థి గుర్రం రమేష్‌పై ఘనవిజయం సాధించినట్లు ఎన్నికల అధికారి వేముల గోవింద్ రాజ్ ప్రకటించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష పదవికి లింగాల భూపాల్, గుర్రం రమేష్, పోటీ పడగా సభ్యులు అందరూ ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో లింగాల భూపాల్ 12 ఓట్లు సాధించి విజేతగా నిలించారు. అధ్యక్షుడిగా లింగాల భూపాల్,(నమస్తే తెలంగాణ) ఉపాధ్యక్షులుగా కుంటోళ్ల యాదగిరి(మన తెలంగాణ), ప్రధాన కార్యదర్శిగా కొండా శ్రీనివాస్ రెడ్డి(సాక్షి) సంయుక్త కార్యదర్శి సల్లూరి నర్సింగ్ రావు(ప్రజాపక్షం), కోశాధికారిగా లంబరాజు యాదవ్ (సూర్య) సలహాదారులుగా మేడబోయిన నర్సింహ(వార్త), ఫొతేధార రామకృష్ణ (ఈనాడు)మేకల పద్మారావు(విశాలాంధ్ర)లను నియమించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సభ్యులు శాలువాలతో సత్కరించి అభినందించారు. ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు లింగాల భూపాల్ తెలిపారు.



## గురుకుల కళాశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ అన్నారు. సోమవారం తెలంగాణ సాంఘీక గురుకుల కళాశాలలో డాక్టర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ డాక్టర్ శోభ ఎండి జనరల్ ఫిజిషియన్, డాక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ జ్యోతిలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా రక్తహీనత కల్గిన పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అలాగే ఆస్తమా, ఎలర్జి, థైరాయిడ్, రుతుస్రావ సమస్య, రక్తపోటు ఇతరత్రా సమస్యలు ఉన్న 120 మంది విద్యార్థినులను పరీక్షించి వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని నాయకులు దీప్తి, హర్షిత, నక్షత్ర, అధ్యాపకులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడి పిలువుతో బిజెపి నాయకుల ముందస్తు అరెస్టు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన సందర్భంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని బిజెపి నాయకులను చర్లపల్లి, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పిఎస్‌కు తరలించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ నయవంచన, మోసపురిత పాలనకు వ్యతిరేకంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైనందున అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారని అన్నారు. అరెస్టు అయిన వారిలో దొమ్మాట నాథం, ఎం లక్ష్మణ్ గౌడ్, రమేష్‌యాదవ్,ఇజాజ్,రాము తదితరులు ఉన్నారు.

## నవాబుపేట్ నూతన ఎస్ఐగా గిరి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట్ మండల నూతన ఎస్సైగా గిరి సోమవారం విధుల్లో చేరారు. వికారాబాద్ పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై వచ్చిన ఆయన, ఇక్కడ పని చేసిన జీ.పుండ్లిక్ స్థానంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై గిరి మాట్లాడుతూ, మండలంలో శాంతిభద్రతలు పరిరక్షించడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజల ఫిర్యాదులపై త్వరితగతిన స్పందిస్తూ, న్యాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరించకుండా చూసేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సైకి స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

## చెత్త లారీ ఢీ కొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొమ్మల రామారం మల్యాల గ్రామనికి చెందిన రవీందర్ (54) ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా కీసర ఔటర్ రింగ్ రోడ్ వద్ద చెత్త లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ ఢీ కొట్టడంతో లారీ వెనక టైర్ల కిందపడి అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### బోరంపేట్ సర్వే నెం.166లో ప్రభుత్వ భూమి రోడ్డుపై

# మండలిలో ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు గళం




ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/దుండిగల్:** బోరంపేట్ ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణంపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు ధ్వజమెత్తారు. బౌరంపేట 166 సర్వే నంబర్‌లో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా 30 ఎకరాల్లో ఓ ప్రవేట్ వెంచర్ కోసం ప్రభుత్వ స్థలంలో నుండి అక్రమంగా దర్జాగా సిసి రోడ్డు వెయ్యడం ఏంటని ప్రశ్నించారు. గతంలో ఈ రోడ్డు విషయమై ప్రజాపక్షం దినపత్రికలో రైతులకు అండగా పలు వరుస కథనాలు ప్రచురించింది. ఈ విషయమై గతంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ప్రతి పక్ష పార్టీల నాయకులు ప్రభుత్వానికి పలు విధాలుగా ఫిర్యాదులు చేసిన పట్టించుకోకుండా రోడ్డు వేయడం దారుణమని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి కాంగ్రెస్ శ్రేణులు గతంలో తీసుకువెళ్లారు. మంత్రి శ్రీధర్ బాబు వెంటనే మేడ్చల్ జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులను రోడ్డు పనులను పర్యవేక్షించి తనకు నివేదిక అందజేయాలని, ఆదేశించిన సిసి రోడ్డు పనులు ఆగకుండా అధికార పార్టీ లో పెద్దల అండదండతో నియోజకవర్గంలో ఓ యువ నాయకుడు ప్రోద్భలంతో దాదాపు కిలోమీటర్ కు పైగా అక్రమ సిసి రోడ్డు ఆగమేఘాల మీద పనులు పూర్తయ్యాయి. పలు తెలుగు దినపత్రికలలో వార్త కథనాలు రాసిన ఇవేమీ పట్టించుకోకుండా గుడ్డిగా కళ్ళు మూసుకున్నారని బౌరంపేట ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయమై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను శాసనమండలిలో సోమవారం జరిగిన మండలి సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభి రాజు, ఈ రోడ్డు ఎవరి కోసం వేశారు. టిజిఐసి కోసం వేశా రా వేస్తే ల్యాండ్ అక్విజియేషన్ చేశారా నష్టపోయిన రైతులకు ఏమైనా లాభం చేకూర్చారా ఇరువైపుల ప్రభుత్వ భూమి ఉండగా మధ్యలో సిసి రోడ్డు వేశారు ఎవరి ప్రయోజనం కోసం వేశారు. జిల్లా మంత్రి నివేదిక కోరిన పనులు ఎందుకు పూర్తయ్యా యి, పెద్దల నుండి ఫోన్ కాల్ రాగానే చర్యలు ఎందుకు తీసుకోలేదో ప్రజలకు తెలియాలని ఏమ్మెల్సీ శంభిపూర్ రాజు ప్రభుత్వాన్ని మండలిలో ప్రశ్నించారు. దీంతో స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు వెంటనే బౌరంపేట అక్రమ సిసి రోడ్డుపై సంబంధిత శాఖతో మాట్లాడి విచారణకు ఆదేశిస్తామని శాసనమండలి సాక్షిగా మంత్రి శ్రీధర్ బాబు సభా వేదిక సాక్షిగా వివరణ ఇచ్చారు. ఎమ్మెల్సీ చేసినవాక్యాలతోనైనా ఈ రోడ్డు పనుల పైన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## తీవ్రమవుతున్న వంట గ్యాస్ కొరత

* మూత బడుతున్న చిన్నా, పెద్దా హోటళ్లు
* హాస్టళ్ల చార్జీలు వెయ్యి రూపాయల మేరకు పెంపు
* ప్రత్యామ్నాయంగా కట్టెలు, బొగ్గులపొయ్యిలు, విద్యుత్ స్టవ్‌లు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఇజ్రాయిల్, అమెరికా కూటమి, ఇరాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధ ప్రభావంతో ఏర్పడిన వంట గ్యాస్ కొరత మేడ్చల్ మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా తీవ్ర ప్రభావం కనపరుస్తోంది. టీ స్టాళ్లు, ఛాట్, టిఫిన్లు, భోజనాలు, కర్రీల విక్రయ దుకాణాలు, తోపుడు బండ్లు, మధ్య తరగతి హోటళ్ల నుండి పెద్ద స్థాయిలో నడిచే మల్టి కృషన్ రెస్టారెంట్లు, వ్యాపారాలుగా నడిచే వసతి గృహాల్లో వంట పదార్థాల తయారీకి అవసరమయ్యే కమర్షియల్ వంట గ్యాస్ సిలిండర్లు సమయానికి అవసరమున్న మేరకు లభించక పోవటం దీనికి కారణమవుతోంది.ఫలితంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో తోపుడు బండ్ల నుండి మొదలెడితే అన్ని హోటళ్లలోనూ తినుబండారాలపై ఒక్కో దానిపై రూ.5నుండి రూ.10 వరకు ధరలను పెంచా యి. కొన్నిచోట్ల గతంలో చేసే తినుబండారాలను తగ్గించి అందుబాటులో ఉన్న వంట గ్యాస్ మేరకే తయారు చేస్తున్నారు. హాస్టళ్లలోనూ ఒక్కో వ్యక్తి నుండి ప్రతి నెలా తీసుకొనే చార్జిలను రూ. 1000 వరకు పెంచేసారు. వంట గ్యాస్ సమకూర్చుకోలేని తినుబండారాలు నడిపించే హోట ళ్లు పలుచోట్ల మూతబడ్డాయి. వంటగ్యాస్ కు ప్రత్యామ్నాయంగా కొంతమంది నిర్వాహకులు తమకుండే అవకాశాన్ని బట్టి కట్టెల పొయ్యిలు, బొగ్గుల పొయ్యిలు, విద్యుత్ స్టవ్‌లను ఏర్పాటు చేసుకొన్నారు. వీటికయ్యే ఖర్చు వంటగ్యాస్ కంటే కాస్తా ఎక్కువ అవటం కారణంగా ధరలను పెంచక తప్పటం లేదని పలువు రు నిర్వాహకులు తెలిపారు. మరో పక్క బొగ్గుల పొయ్యి, కట్టెల పొయ్యి వినియోగించటం వల్ల పొగ రావటంతో వాతావరణ కాలుష్యం సైతం ఎదుర్కోవలసి వస్తోందని వాపోతున్నారు. అటు వంట గ్యాస్ సమకూర్చుకోలేక, ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసుకోలేక తమ వ్యాపారాలను మూసివే యటం వల్ల నిర్వాహకులే కాకుండా ఒక్కో చోట సగటున 5 కుటుంబాలు ఆదాయాన్ని కోల్పోవలసి వస్తోంది. మరో పక్క నిర్వాహకులు తమ తయా రీ పదార్థాలు తగ్గిపోవటం వల్ల హోటళ్ల నుండి వినియోగదారుల ఇళ్లకు సరఫరా చేసే జొమా టో, స్విగ్గీ లాంటి సంస్థల డెలివరీ బాయిస్ జీవనాలు సైతం అగమ్యగోచరంగా తయారవుతోంది.








## నీటిని పొదుపుగా వాడాలి

### పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్



**ప్రజాపక్షం/దుండిగల్:** ప్రపంచ నీటి పొదుపు దినోత్సవ సందర్భంగా జిల్లా పరిషత్ హై స్కూల్ సూరారం కాలనీలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు డ్రాయింగ్ వేయించి బహుమతులు అందజేశారు. సామాజికవేత్త పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, వర్షపు నీరే జీవనాధారం కాపాడుకోవడం మన ధర్మం అని ఎక్కడ చూసినా కాంక్రీట్ జంగల్ అయిందని నీళ్లు భూమిలోకి పోయే పరిస్థితి లేదని కావున నీటిని పొదుపుగా వాడడం మన బాధ్యతని వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపినప్పుడే వర్షం నీరు మనకు లభిస్తుందని, లేనిచో 600 అడుగుల వేసినా 6 చుక్కల నీరు రాదని, రక్తం దొరుకుతుందేమో గాని మనకు నీరు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని కావున ప్రతి విద్యార్థి నీటిని పొదుపుగా వాడే విధంగా మనం అవలంబించుకోవాలని అన్నారు. ఒక కేజీ, బియ్యం రైసు పండించాలంటే 250 లీటర్లు నీళ్లు అవసరం, ఇంట్లో, ఉన్నప్పుడు చిన్నపాటి గ్లాసులు వాడాలని పెద్ద గ్లాసులు వాడవద్దని బట్టలు ఉతికిన నీటిని మనం బాత్రూంలో వాడాలని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో హెడ్మాస్టర్ పుణ్యవతి, మల్లికార్జున్, నాగరాజు, మహేష్ బాబు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### కలెక్టర్ దీపక్ తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్:** పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వచ్చిన వారి ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమానికి 0135 ఫిర్యాదుల స్వీకరించ డం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారీగా డిపిఒ, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణం, డిఆర్‌డిఎ, ప్రణాళిక శాఖ, భూసేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్ ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. 99రోజుల ప్రాజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ మండల ,మున్సిపాలిటీ జిల్లా స్థాయిలో రోజువారి షెడ్యుల్ ప్రకారం ప్రజలు,ప్రజాప్రతినిధులు నిర్వహించిన కార్యక్రమంలో నిర్వహించిన ఫోటోలు , వివరాలను సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వరి, జెడ్పిసిఇఒ సుధీర్, డిఆర్ఒ మంగీలాల్, డిఆర్ఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**పరీక్షా కేంద్రాల ఆకస్మిక తనిఖీ:** పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు , ప్రశ్నపత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి వసతి, ఆరోగ్య కార్యకర్త అందుబాటులో ఉన్నారా అని ఆరా తీశారు. ఎక్కడ కూడా కాపీయింగ్‌కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్‌కు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు.





## అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


### కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** పదో తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు సంబంధింత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల నిర్వహణ తీరును ఆయన స్వయంగా సోమవారం హకీంపేటలోని తెలంగాణా ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల ఏర్పాటును అడిగి తెలుసుకొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి, శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## వైభవంగా శ్రీ వెంకట శివ రామాలయం వార్షికోత్సవ, బ్రహ్మోత్సవ వేడుకలు

### ప్రత్యేక పూజలు చేసిన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్





**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, బాచుపల్లి, కౌసల్య కాలనీలోని శ్రీ వెంకట శివ రామాలయం ద్వితీయ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో మాజీ కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త ఆగం రాజు ముదిరాజ్, లక్ష్మి లు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం తెల్లవారుజాము నుండి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, పంచగవ్య మేళనము, పంచగవ్య ప్రాశన ఋత్విక్ వరణము, యజ్ఞశాల ప్రవేశం, ధ్వజారోహణం, యాగశాల సంస్కారం, సాయంత్రం నవగ్రహ, మాతృక, యోగిని, వాస్తు, క్షేత్రపాలక, బ్రహ్మాది, మండల దేవతా స్థాపనములు, హోమకుండ సంస్కారము, అగ్నిప్రతిష్ఠ, ప్రధాన దేవతా మంత్ర హవనములు, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వినియోగము తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగంరాజు ముదిరాజ్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు ఆలయ వార్షికోత్సవ వేడుకలతో పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు, శ్రీరామ నవమి వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 24న ఆయా దేవతా మూర్తులకు అభిషేకాలు, స్థాపిత దేవతా పూజలు, సుదర్శన శతక హవనము, సాయంత్రం రుద్ర హవనము, మన్యు సూక్త హవనము, చండీ హోమము (దుర్గా సప్త శతి హవనము), ఈ నెల 25న శాంతి పౌష్టిక మంత్ర హవనములు, జయాది హోమము, బలి ప్రదానము, పూర్ణాహుతి, మహాకుంభాభిషేకము తదితర పూజలు, 27న శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు జరుగుతాయని, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామి వారి ఊరేగింపు, తదితర కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## షహీద్ భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడు

### ఎఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు సల్మాన్‌బేగ్, టి.సత్యప్రసాద్

**ప్రజాపక్షం/కాప్రా:** షహీద్ భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శ ప్రాయుడని, ఆయన అడుగుజాడల్లో యువత వెళ్లాలని ఎఐవైఎఫ్ మేడ్చల్ జల్లా అధ్యక్ష కార్యదర్శులు సల్మాన్‌బేగ్, టి.సత్యప్రసాద్‌లు పిలుపిచ్చారు. సోమవారం భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా ఇసిఐఎల్ చౌరాస్తాలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుండే దేశ భక్తిని పుణికి పుచ్చుకొని ప్రాణాలర్పించి వీర మరణం పొందిన వారి పోరాట పటిమతో కార్యకర్తలు ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్‌కు చెందిన జిల్లా మహిళా కన్వీనర్ జి.స్వప్న, ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షులు వికాస్‌రెడ్డి, సతీష్ కుమార్, కౌశిక్, కిరణ్ కుమార్, రజిత, శాంభవి, మేఘన, తదితరులు పాల్గొన్నారు.




## షాహిద్ సర్దార్ భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం : కృష్ణ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** షాహిద్ సర్దార్ భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం షాహిద్ సర్దార్ భగత్‌సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా కూకట్‌పల్లి మండలం శ్రీశ్రీ నగర్ సిపిఐ కార్యాలయం వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తూ, సమసమాజ నిర్మాణానికి నేటి యువతరం కృషి చేయాలని అన్నారు. నేటితరం యువకులు సర్దార్ భగత్‌సింగ్ చేసిన పోరాటాలు, వారి త్యాగఫలం మూలంగా స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చేసినటువంటి పోరాటాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ నగర్ సిపిఐ శాఖ కార్యదర్శి కె.మనోచారి, గంగన్న, రాములు, సరోజ, ఉమారాణి, ఛాయా తదితరులు పాల్గొన్నారు.

## ఆల్విన్ కాలనీ సమస్యలపై డిసికి వినతి




**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** మూసాపేట్ మున్సిపల్ ఆఫీస్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రాజన్న టీమ్ సభ్యులు బుల్లెట్ రవి ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలినీ డిసిని కలిసి పలు ప్రధానమైన సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఎల్లమ్మబండలోని కొత్త వాటర్ ట్యాంక్ సమీపంలో రోడ్డు నిర్మాణం పూర్తయినప్పటికీ పేరుకుపోయిన మట్టిని తొలగించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే వాటర్ ట్యాంక్ నుంచి ఆల్విన్ కాలనీకి నీటి సరఫరా జరుగుతున్న నేపథ్యంలో అక్కడ భద్రత లేకపోవడం ఆందోళనకరమని తెలిపారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, సిసి కెమెరాలు ఏర్పాటు చేసి 24గంటలు వాచ్‌మెన్‌ను నియమించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఎల్లమ్మబండలోని భారతీయ విద్యాలయ పాఠశాల సమీపంలోని కమ్యూనిటీ హాల్‌లో కొందరు వ్యక్తులు తమ పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, వాహనాలను పార్క్ చేయడం వల్ల ఇతర కాలనీల ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిటీ హాల్‌ను అన్ని కాలనీల ప్రజల కు అందుబాటులో ఉంచేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రాకేష్, ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## శివాలయ భూమి కబ్జాపై ఫిర్యాదు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శివాలయానికి చెందిన భూమి కబ్జాకు గురైందని మజీద్‌పూర్ గ్రామస్థులు ప్రజావాణిలో సోమవారం పిర్యాదు చేశారు. అలియాబాద్ మున్సిపాలిటి మజీద్‌పూర్ గ్రామానికి చెందిన కౌన్సిలర్ జశ్వంత్‌రెడ్డి, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, తుంకి మల్లేష్‌లు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మజీద్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. సర్వే నెంబర్ 168లో 1 ఎకరం 17 గుంటల ప్రభుత్వ భూమిలో శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన భూమిని కొంతమంది ఆక్రమించారని ఆరోపించారు. సుమారు 500 సం.ల చరిత్ర కల్గిన ఈ శివాలయం పూర్తిగా ప్రభుత్వ భూమిలోనే ఉందని అయినా చుట్టు పక్కల వారు భూమిని స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఇటీవల దేవాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారని గ్రామస్థులు అందరు కలిసి భూమిని సర్వే చేయాలని డిమాండ్ చేశారని అన్నారు. ప్రభుత్వ భూమికి సంబంధించి సర్వే నిర్వహించి హద్దులు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మజీద్‌పూర్ గ్రామస్థులు ఉన్నారు.

## అత్యాచార నిందితుడుకి పదేళ్ళ జైలు శిక్ష, రూ.12వేల జరిమాన : ఎస్‌పి స్నేహ మెహ్రా



**ప్రజాపక్షం/తాండూరు/పరిగి:** పరిగి పోలీసు స్టేషన్ పరిధిలో 2016 లో నమోదైన కేసులో నిందితుడికి కోర్టు పదేళ్ళ కారాగార శిక్ష, రూ.12వేలు జరిమాన విధిస్తూ తీర్పు నిచ్చిందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. పరిగి మండల పరిధి బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన సుక్కని అంజయ్య(37)పై 2016లో అత్యాచారం, బెదరింపులకు సబంధించిన క్రై నంబర్ 268, 2016 లో ఐపిసి సెక్షన్ 376, 506 కేసు నమోదైనట్లు తెలిపారు.ఈ కేసు విచారణ వికారాబాద్‌లోని మొదటి అదనపు జిల్లా సేషన్స్ కోర్టులో కొనసాగినట్లు తెలిపారు. పక్కా సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి చౌదరి చంద్ర కిషోర్ నిందితుడు అంజయ్యను దోషిగా నిర్ధారిస్తూ పదేళ్ళ జైలు శిక్ష, రూ.12వేలు జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్‌పి పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా విశేష కృషి చేసిన అధికారులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

